

ఏప్రిలు నెల సిల్వర్ చెట్లు ఎఱుపు, పసుపు మిళితమైన రంగుల పువ్వులతో అందంగా రోడ్ల కిరు వైపులా నిటారుగా నిల్చున్నాయి, నలుపు తెలుపు రంగులు రెక్కలు గల గోర పిట్టలు ఆ చెట్ల పైన ఎగురుతూ ఒకటే గోల చేస్తున్నాయి

బ్లాకాఫీసు నుంచి జీపు రోడ్డు మీదికి రయ్యిన దూసుకు వచ్చింది బీడీవో సోమసుందరం ముఖాన్న చెమట లేకపోయినా రుమాలుతో తుడుచు కున్నాడు, డ్రైవరు సింగు అడిగాడు జీపు 'ఎటుపోనిమ్మంటా' రని

“మట్టు జోరు ” నొక్కి అన్నాడా మాట బిడీవో అతనా బ్లాకుకి ట్రాన్స్ఫరయి వచ్చి నాలుగు నెలలయింది విసిగి పోతున్నాడా ప్రాంతపు ప్రజలతో, వారం రోజుల క్రితం హౌసింగ్ కాలనీ పనులు ఎంతవరకూ వచ్చాయ్? అని ప్రశ్నిస్తూ చురుగ్గా చూశాడతని వైపు కలెక్టరు నువ్వెత్తు చేతకాని వాడివి, చవటవి అన్నట్లు అతను అన్నాడు నెమ్మదిగా తల వంచుకుని, “ఇంకో వారం రోజుల్లో పూర్తి చేయిస్తాను”

ఆ జవానుకి కలెక్టరు గారికి ఆగ్రహం వచ్చింది “ఈ వారం రోజులు అనే మాట గోడ మీద రాసెయ్యవయ్యా' ఎప్పుడు అడిగినా వారం అంటావ్! యూస్ లెస్” ఫెలో అన్నమాట పెదవుల మధ్యనే బిగించేశారు కలెక్టరుగారు

మనస్సు చివుక్కు మంది సోమసుందరానికి కలెక్టరింకా తన లాంటి వాళ్ళని పచ్చిగా తిడతాడని విని నవ్వుకున్నాడు కాని ఇవ్వాళ తననే యూస్‌లెస్‌ఫెలో అంటే ఎందుకో బాధనిపించిందతనికి ఎలాచెప్పినా ఎంత చెప్పినా అర్థం చేసుకోని ఆ ప్రాంతపు ప్రజలపైన అతనికి కోపం వచ్చింది ఆ మరునాడే, “క్యాంపు” వేసుకుని కొన్ని గ్రామాలు, భోజనంకూడా లేకుండా సాయంత్రం వరకూ తిరిగేశాడు, సూపర్‌వైజరుని కూడా తీసుకువెళ్ళి మార్కింగులిప్పించాడు తొందరగా ఇళ్లు కట్టెయ్యాలి అని తాముచెయ్యబోయేసహాయం వివరించి చెప్పాడు

# క్యాంపు

## కొవిలిపాటి విజయలక్ష్మి



కొందరు అలానే అని సమ్మతంగా తల ఊపారు కొందరు ప్రభుత్వ మిచ్చే సహాయం చాలదన్నట్లు అసంతృప్తి వ్యక్తం చేశారు మరి కొందరు పెద్దలు సిమెంటు రేకులు కూడా ఇస్తే బాగుంటుందన్నారు అందరికీ ఓపిగ్గా జవాబులిచ్చాడు, ఓపిక నశించి ఎందుకు వచ్చిన ఉద్యోగంరా భగవంతుడా అని పించిందారోజు. అతనితో పాటు డ్రైవరూ మిగతా క్యాంపు వెళ్ళిన వారూ విసిగిపోయారు

సడన్ బ్రేకుతో జీపు ఆగిపోయింది వాస్తవంలోకి వచ్చిన సోమసుందరం కనులకు, దోవకు అడ్డుగా తాడుతో జీపు చుట్టూ మూగిన ఆడవాళ్ళు కనుపించారు

"ఏమిటిది? ఎందుకిలా నిల్చు న్నారు?" అడిగాడు డ్రయివరును సింగు పెదవులమీద చిరునవ్వు కదిలింది "ఇటికల పండుగ సార్" అన్నాడు

"అంటే?" అర్థంకాని బిడీవో ప్రశ్నించాడు

"మనం కొత్తసంవత్సరం పండుగ జరుపుకున్నట్లు వీళ్ళు సంవత్సరాని కోసారి పండగ చేసుకుంటారు సార్" అని తనజేబులోని డబ్బులు తీసి జీపు ధగ్గిర నిల్చున్న అమ్మాయి చేతిలో పడేసి తాడు తియ్యండి అన్నాడు సింగు


"ఇదేనా ఇస్తావు రూపాయి ఇవ్వాలి' అంటూ సింగు దగ్గర కొచ్చి నిల్చుంది ఒకామె

ఈ సారి సోమసుందరం జేబు లోంచి రూపాయి తీసి వాళ్ళకిచ్చే శాడు

తాడు తీసి అడ్డం తొలగి పోయారు జీపు స్టార్టయింది

"ఇదేంఆచారమయ్యా!"నవ్వుతూ అన్నాడు సోమసుందరం

"అంతే సార్. ఇలా దోవ అడ్డ గించి డబ్బులు వసూలు చేస్తారు




ఆడవాళ్ళు, ఈ పండగ రోజుల్లో ఆడా మగా ఏ పనుల్లోకీ వెళ్ళరు సార్"

"ఎలా గడుస్తుంది వీళ్ళకు?"

"చోడిపిండి ధాన్యం,నూనె,ఉప్పు అన్నీ వారం రోజులకు సరిపడా ముందే నిలవ చేసుకుంటారు సార్"

"ఓ" నవ్వుకున్నాడు సోమసుందరం

ఒక ఫర్లాంగు దూరం జీపు వెళ్ళిందో లేదో మళ్ళీఅడ్డంవచ్చారు రంగు రంగుల పువ్వుల చీరలుకట్టిన గిరిజన యువతులు చేతుల్లో ఇత్తడి చెంబులున్నాయి

సింగు కసురుకున్నాడు అడ్డం తొలగండి అంటూ అయినా వాళ్ళు ఖాతరు చెయ్యలేదు అడ్డం తొలగలేదు. రోడ్డుకి అడ్డంగా బారుకట్టి నిల్చున్నారు. మరొక రూపాయి తీసి ఇచ్చేశాడు సోమసుందరం గత్యంతరం లేదన్నట్టు.

మట్టుజోరు చేరే సరికి మరొక రూపాయి ఊడిపోయింది అయనకి

ఊరంతా పండగ సందడి, ఇళ్లన్నీ లక్కపిడతలలా ఎఱుపు నలుపురంగులతో అలికి రంగవల్లులు తీర్చారు అక్కడక్కడమామిడాకుల తోరణాలు కట్టారు. ఒక్కో ఇంటి అరుగుమీద ఓ వెదురుచాప, దాని మీద ఆశీనులై అతిధులున్నారు

జీపు ఊరుమధ్యకు వెళ్ళి ఆగింది తెల్లని బట్టల్లోఉన్న సోమసుందరం జీపులోంచి దిగాడు.

బిలబిలా జీపు చుట్టూ మూగారు

పిల్లా, పాపా, జనం

పెద్దలంతా తాగిన మైకంలో మత్తుగా గీరగా చూస్తున్నారు జీపు వైపు, బీడీవో వైపు

"మీ ప్రెసిడెంటు ఎక్కడ?" సోమసుందరం ప్రశ్నించాడు వారందరినీ కలియజూస్తూ

"ఏటకి వెళ్ళాడు బాబు" జవాబు వచ్చింది

"ఇళ్లుకట్టడం మొదలు పెట్టారా?"

"పండగ బాబు"

చిర్రెత్తుకు వచ్చింది సోమసుందరానికి "తినటానికి లేదుగాని పండగేమిటయ్యా? బియ్యం, గోధుమలు, రెండువందల రూపాయలూ ఇస్తాం ఇళ్ళు కట్టండి" అన్నాడు మత్తులో జోగుతున్న వారందరివైపు జూస్తూ

"వర్షాలు ఒచ్చేస్తాయి గోడ కరిగి పోతాది. సిమెంటు ఇత్తారా?" ఒకడి ప్రశ్న

"సిమెంటు ఇవ్వరు. ముందుపాక వేసి గోడ కట్టండయ్యా" చిరాగ్గా అన్నాడు సోమసుందరం

"కొండనిగడ్డి లేదండి, కాల్పించేశారు గదయ్యా" రెట్టింపు చిరాకుతో వచ్చింది జవాబు

జీడితోటలు పాతించటానికి వరస పెట్టి కాల్పించేరు అడవులు గడ్డి గాదం తగలబడిపోయాయి నిజమే క్షణం ఆలోచనలో పడిన సోమ సుందరం "ఉంటుందయ్యా! వేటకి వెళ్ళే బదులు గడ్డికి వెళ్ళండి రేపు పదిహేనో తారీకుకి ఇళ్ళు కట్టి చూపించాల ఏదీ మే మిచ్చిన మార్కింగులు. అలానే ఉన్నాయి, పది రోజుల క్రితం చెప్పి వెళ్ళాం తర్వాత అలానే అన్నారు మీ ప్రెసిడెంటు ఏడీ?" అన్నాడు.

"ఏటకి ఎళ్ళాడని సెబితిమి గదయ్యా!" ఈ సారి ఒక గిరిజన యువతి చెప్పిందా జవాబు

"ప్రెసిడెంటమ్మ ఏదీ!" అడిగాడు సోమసుందరం ఆమెని

"నీల్లకు గెడ్డకెళ్ళింది"

"పిలుసుకు రండి" ఒకతను చెప్పాడు.

మళ్ళీ కలెక్టరు, అతని ముఖం, అతని చురుకైన చూపులూ, గుర్తు వచ్చి, తననూ, తన అసమర్థతనూ తన ఉద్యోగాన్నీ తిట్టుకున్నాడు సోమసుందరం "ఇళ్ళు తొందరగా కట్టండయ్యా!" మరోసారి చెప్పాడు.

పదిరోజుల క్రితం సూపర్ వైజరునీ, తనతో తీసుకు వచ్చి మధ్యాహ్నపు ఎండకు నెత్తిమాడుతూంటే, గొంతు ఎండి దాహం పుట్టినా మంచి నీళ్ళు పుట్టని ఆ కొండ దిగువ స్వయంగా మార్కింగు లిప్పించాడు, రెండు గదుల ఇల్లు ఒకటి వంట గది. రెండు చీకటి గది, దానికి కిటికీలుండవు దాని ద్వారం మొదటిగదిలోకి ఉంటుంది ఆ గదిని, చుట్టాల గది అంటారు ఇంటికి బంధువులు వచ్చి రాత్రి ఆగితే వారికి ఆగదిలో పక్క పరుస్తారు వారి ఖర్చులు ఏ పద్ధతిలో ఉంటాయో అదే రీతిలో, కొంత వెదురు పుల్లలు పాతించి మరి మరీ

ఒకటిక పది సార్లు వాళ్ళకి అర్థమయ్యే భాషలో వారికి నచ్చజెప్పే రీతిలో చెప్పాడు దాహంతో నాలిక తడారి పోతూంటె, మంచి నీళ్ళిస్తామన్న వాడే లేడు. కొంత దిగువ పెద్ద బండ ప్రక్కన ఉన్న చింత చెట్టు కొమ్మ ఎగిరి అందుకుని దాని చిగురాకులు తెంపి నోట్లో వేసుకున్నాడు పర్కిన్సుపెక్టరు ధర్మారావు తర్వాత సూపర్ వైజరు నాలుగు ఆకులు తెంపి నోట్లో వేసుకున్నాడు ఆతర్వాత తను కూడా ఆ కొమ్మ అందుకుని అబగా ఆ ఆకులు నాలుగు నమిలాడు అనాటి తమ అవస్థ గుర్తు వచ్చి సోమసుందరం పెదవులపై చిరునవ్వు లాస్యం చేసింది

"రేకులిప్పించండి "గుంపులోంచి ఒక గొంతు గట్టిగా అరిచింది

"బాగా తాగి వున్నారు, లాభం లేదు సార్" గొణిగి నట్లన్నాడు డ్రైవరు సింగు.

"గడ్డితో కట్టండయ్యా, తర్వాత మీకు పెంకుటిళ్ళు ఇస్తుంది గవర్నమెంటు" కోపంగా అన్నాడు విడీవో అప్పారావు

"గడ్డి పెమాదం కదయ్యా" అన్నాడు ఒకడు

మౌనంగా ఊళ్లోకి నడిచాడు బిడీవో కమ్యూనిటీ హాలులో గాడిదలు పడుకున్నాయి ఇవతల పిల్లలు ఆడుకుంటున్నారు

నీళ్ళకి వెళ్ళిన ప్రెసిడెంటమ్మ ఆదరాబాదరాగా అక్కడికివచ్చింది ఆమె వెనుక మరి కొందరు మహిళలు వచ్చారు

"నమస్కారమయ్యా" బిడి ఒకి వినయంగా నమస్కరించింది మహిళా మండలి ప్రెసిడెంటు 'ముత్తిఅమ్మ'

"ఏంముత్యాలమ్మా! విస్తరాకులు కుట్టిస్తున్నావా? డబ్బు లిచ్చారా? నవ్వుతూ ప్రశ్నించాడు సోమసుందరం 'ముత్తిఅమ్మ' అని నోరుపలక నట్లు ఆమెను 'ముత్యాలమ్మా' అనే సంబోధిస్తాడతను అతనలా పిలిచినప్పుడు ఆమె, ఆమె చుట్టూ ఉన్న వారూ నవ్వుకుంటారుముసిముసిగా.

"డబ్బు లిచ్చారయ్యా తొంబయి రూపాయ లిచ్చారు. ఆకులు కుట్టినామయ్యా!" అని ప్రెసిడెంటమ్మ వెనుక నిల్చున్న 'రంబ' అనే ఆమె ముందుకు వస్తూ చెప్పింది.

"పుస్తకమిచ్చారా? డబ్బులు కడుతున్నారా?" మళ్లీ సోమసుందరం ప్రశ్న. పరుగుపరుగునవెళ్లి,సిన్నమ్మ అనే యువతి పుస్తకం పట్టుకు వచ్చి అతనికి చూపించింది

ఆ పుస్తకం తెరచిచూసిన అతను "ఐదు, పది కట్టనక్కర లేదమ్మా. వారానికి రెండు రూపాయలుకట్టండి చాలు" అన్నాడు

"ఆడు ఒల్లకోడయ్యా! డబ్బు సాలదు ఇరవైకట్టండి అని దద్దరించేస్తున్నాడు" చెప్పింది సిన్నమ్మ

"నేను కనుక్కుంటాను. విస్తరాకులు వందకి రెండు రూపాయలిస్తారు. అమ్మి వారానికి రెండు

రూపాయలు కడితే చాలు" చెప్పాడు సోమసుందరం

"వంద ఆకులకి రూపాయే ఇస్త మంటాడు బేరగాడు రెండు రూపాయలివ్వడయ్యా కొండనిఆకులేదు" ఫిర్యాదుచేసింది రంబ. ఎర్రని చీర పవిట చివర అటునుంచి కొంగులో బుజంమీద ముడివేసి ఆచీర ఎలా కట్టిందో అర్థంకాని కట్టులో పచ్చని శరీర ఛాయగల 'రంబ' గుండ్రని ముఖం, నల్లని కురులు, నున్నగా దువ్వీచుట్టిన కొప్పులోఎర్రనిపూలు, అవేపూలు చెవిమీద గుత్తిగా కొన్ని ముడిచి, అర్ధ చంద్రాకృతిలో ఉన్న అందమైన నుదుట గుండ్రని ఎర్రని బొట్టు పెట్టుకుని, చెవులకు, ముక్కుకు వారి నాగరికతకు సంబంధించిన ఆభరణాలలో 'రంభ'లానే ఉంది

"రెండు రూపాయలిస్తేకాని ఇవ్వమనండి వాడే కొంటాడు" అని పుస్తకం సిన్నమ్మ కిచ్చేశాడు బీడీవో

"మామహిళామండలికిరెండుకఱ్ఱ కుర్చీలిప్పించడయ్యా!" అడిగింది ముత్తి అమ్మ,

అలానే అని తల ఊపి, మళ్ళీ మరొకవైపు నడిచాడు సోమసుందరం ఒకఇంటిఅరుగుమీదఅడమగా పది మంది కూర్చుని, సిలువరు గిన్నెలలో, ఎత్తిపట్టుకుని అంబలి తాగుతున్నారు, వాకిట్లో చాపమీద ఎండలో నిండాకప్పుకుని ఒకమనిషి పడుకొనిఉన్నాడు.

అతని కేదో అనుమానం వచ్చి టక్కునఆగి గడపలో అంబలి త్రాగుతున్న వ్యక్తుల వైపు వాకిట్లో పడి ఉన్న మనిషివైపు ఓసారి అయోమయంగా, మనిషి చచ్చిపడిఉంటె వీరంతా ఇంత స్థిమితముగా అంబలెలా తాగు తున్నారు? అనేఆశ్చర్యంతోచూసి "అతను?" అని వేలుపెట్టి చూపి అడిగాడు సింగుని

"జ్వరంవస్తే ఇలా ఎండలో పడుకుంటారు సార్" అన్నాడు, చిన్నగా నవ్వుతూ సింగు

ముందు బీడివో తర్వాత వీడివో వెనుక డ్రైవరు నడవసాగారు జీపు ఉన్నవైపు


"తాగుబోతు నంజకొడకల్లారా? పోతున్నాడుకదర్రా" అరిచా డొకడు అతనూ బాగాతాగిఉన్నాడు

తాగిన మైకం విడినట్లు నలుగురు వ్యక్తులు అరచిన వాడితో పాటు బీడివో వెనుకవచ్చి గబగబా అతన్ని దాటి ముందుకువచ్చి దారికి అడ్డంగా నిల్చుని "మాకు గేదెలివ్వాల" అన్నారు

"ఇస్తాం పైకి రాశాం వస్తాయి" అని వారిని తప్పించుకొని గబగబా నడిచి జీపుఎక్కి కూర్చుని "గేదెలు, పోతులు, వాటిని మేపరు, కడగరు, నిష్కారణంగా చంపేస్తున్నారు మూర్ఖులు" గొణుక్కున్నాడు సోమసుందరం

ఫర్లాంగుదూరం జీపువచ్చిందో లేదో మళ్లీ రోడ్డుకి అడ్డంగా నిల్చున్నారు ఆడవాళ్లు

"అడుగడుగున ఏమిటిది? చెప్ప




వయ్యా సింగూ" అన్నాడు బీడీవో

"అడ్డం తీస్తారా తొక్కించెయ్య మన్నారా? ఎన్ని సార్లు ఇస్తాం డబ్బులు?" అని వాళ్ళని దమాయించాడు సింగు

అయినా అర్ధరూపాయి పుచ్చుకున్నాక కాని వాళ్ళు వదలలేదు "ఎంతకాలంచేస్తారోయ్ ఈపండగ?" నవ్వుతూ అడిగాడు సింగుని సోమసుందరం

ఈ నెలంతా ఇంచుమించుగా ఏదో ఊళ్ళో పండగ జరుగుతూనే ఉంటుందిసార్! ఒక్కొక ఊర్లో ఒక్కొక వారం జరుపుకొంటారు పండగ చేస్తున్న ఊళ్ళోని బంధువుల ఇంటికి ఆ వారం పండగ చేసుకోని ఊరి వారు వచ్చి చుట్టరికం చేస్తూంటారు, మగవాళ్ళు వేటకి వెళ్తారు పూర్వపు రోజుల్లో ఏ ఎలుగునో, పులినో వేటాడి తేవటంగొప్ప ఇప్పుడు వేట నిషేధం కదా! అయినా ఏ కొండ గొర్రెనో వేటాడి తెచ్చుకొంటారు" చెప్పాడు సింగు

మట్టి రోడ్డుదోవ దాటి జీపు తారు రోడ్డుమీదికి వచ్చాక 'ఎటుపోనిమ్మన్నారుసార్' అడిగాడు సింగు సోమసుందరాన్ని

ఓ క్షణం ఆలోచించి, 'లంచ్ మాటకేం ఇహ సాయంత్రమే' అని మరొక ఊరు పేరు చెప్పాడు బి డి ఒ.

జీపు మెత్తగా కొంతదూరం సాగి, సోమసుందరం సర్వీసులాగే, అంటే అతను వయసులో ఉన్నప్పుడు పట్నంలో ప్లెయిన్ బ్లాకుల్లో పనిచేసి వయసుజారి రిటైరవబోయే ముందు

ఏజన్సీ సర్వీసుకి వచ్చినట్లు, మధ్యాహ్న సూర్యుడు పడమటిదిశకు వాలటం ప్రారంభించాక, గతుకుగతుకుల ఎగుడుదిగుడు రోడ్డు పట్టింది జీపు ఆ ప్రాంతమంతా కొట్టినపిండి సింగుకి. అతనా బ్లాకులో పదహారు సంవత్సరాలు పాతుకు పోయాడు ఆ రోడ్లకి అలవాటు పడిపోయాడు అతను జీపు నడపటంలో మంచి నేర్పరి

తర్వాత ఘాట్ రోడ్డు ఎక్కింది జీపు తామున్నదే సముద్ర మట్టానికి ఎన్నో వందల మీటర్ల ఎత్తున, మళ్ళీ ఇక్కడనుంచి ఎత్తు పర్వత శిఖరా లెక్కుతున్నారు. రోడ్డుకిరువైపులా వెనక్కి నడిచి పోతున్న కొండలు, గుట్టలు, అడవులు, అగాధాలు. అక్కడక్కడ ఏవో అడవి పూలు, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించాడు కొన్ని క్షణాలు సోమసుందరం, తా నెదుర్కొంటున్న చిక్కు సమస్యలు మరచి

ఊరిపొలిమేరలో మళ్ళీకొప్పుల్లో ఎర్రని తురాయి పూలు ముడుచుకున్న స్త్రీలు పిల్లా పెద్దా మళ్ళీ జీపుకి అడ్డం వచ్చారు జేబులోని పర్సుతీసి చేతి కందిన చిల్లర డబ్బులు వాళ్ళుపట్టిన పళ్ళెంలో వేసేశాడు సోమసుందరం

ఊర్లో జీపు ఆగీ ఆగటంతో పిల్లా, పెద్దా మూగారు చుట్టూ.

"మీ ప్రెసిడెంటు ఎక్కడయ్యా?" జీపు దిగి అందరినీ కలియజూస్తూ అడిగాడు సోమసుందరం

"జొరము ఉన్నదయ్యా" వచ్చింది జవాబు,

ప్రెసిడెంటు ఇంటివైపు నడిచారు

వాకిట్లో చాపమీద కూర్చున్నాడు ఊరు ప్రెసిడెంటు. అతను బిడీవోని చూసి నమస్కారం అనలేదు సోమసుందరమే "నమస్కారం ప్రెసిడెంటుగారూ" అన్నాడు

అతను తలెత్తి బిడీవో వైపు చూసి "నాలుగు రోజులయి జ్వరము" అన్నాడు లేచినిల్చోలేదు నమస్కారానికి ప్రతినమస్కారంచెయ్యలేదు.

"ఇళ్ళు కట్టించెయ్యాల" అన్నాడు సోమసుందరం

"పండుగ అయ్యాక" జవాబిచ్చాడు ప్రెసిడెంటు

"పండుగ అయితేనేం? కట్టించెయ్యండి పదిహేనురోజుల్లో ఇళ్ళు చూపించాల కలెక్టరుగారువస్తారు"

"వీలవదు" అన్నట్లు తల అడ్డగా ఊపాడు ప్రెసిడెంటు.

"అలా అంటె ఎలా, మీరు మీ వాళ్ళకి ఉషారిచ్చి తొందరగా ఇళ్లు కట్టించెయ్యాల బియ్యం యిస్తాం' గోధుమలిస్తాం, రెండువందలరూపాయలిస్తాం"

"అన్నీ యిస్తారు కాని పండుగ రోజుల్లో పనిముట్టరు" ఖచ్చితంగా చెప్పాడు ప్రెసిడెంటు, బిడీఓ మాట పూర్తికాకుండానే

ఆ ఊరి ప్రెసిడెంటుకి ఇద్దరు భార్యలు. సాధారణంగా ఊరి పెద్ద ప్రెసిడెంటు అనేవాడికి ఇద్దరు భార్యలేవుంటారు అది ఒకప్రిస్టేజ్

అతని పెద్దభార్య అతనితలవంచి ఒత్తుగా బలిసి వున్న జుట్టుకి ఆవ నూనె మర్దన చెయ్యటం మొదలు పెట్టింది

“మరివెళ్తున్నాం ఇళ్ళు తొందరగా కట్టించెయ్యండి” మరో సారి చెప్పాడు బి డి ఓ

“ఆఁ మంచిది” అన్నాడు ప్రెసిడెంటు

మళ్ళీ మరొక ఊరి వైపు ప్రయాణం సాగించింది జీపు

మళ్ళీ ప్రెసిడెంటు ఏడీ? అనే ప్రశ్న వేటకి ఎళ్ళాడు జవాబు

ఆ ఊర్లో అడుగుపెట్టాడో లేదో పెద్దగాలి చుట్టుముట్టింది మబ్బులు కమ్మి వడగండ్లవాన ప్రారంభమయ్యింది

ప్రెసిడెంటు ఇంటి వరండాలో అతని పెద్ద భార్య మంచం వాల్చి దానిమీదదుప్పటిపరిచి “కూర్చోండి” అని మర్యాద చేసింది అతిధులకు

పాంటుజేబులోంచి రుమాలు తీసుకుని ముఖంమీద చేతులమీద పడిన వర్షపు చినుకుల తడి వత్తుకున్నాడు సోమసుందరం.


పర్వత శిఖరాన ఉన్న ఊరు అక్కడ ఉన్న పచ్చని పంట పొలాలు, గలగల పారే సెలయేరు, జవజవలాడుతూ, డెల్టా భూములను గుర్తుకు తెచ్చే అక్కడి పంట భూములు, పచ్చగాచిగిర్చి దట్టంగా అల్లుకున్న అడవి మొక్కలు, గడపల అవతల నుంచి, గోడల చాటు నుంచి, తమవైపు చిత్రంగా తొంగి చూసే, గిరిజన యువతులు, వడగండ్ల వాన, చేవగల చెక్కల మర్చిన మిద్ది ఇంటి వసారాలో తను కూర్చున్న మంచాని కెదురుగా మూసి ఉన్న కొత్తబుట్ట దానిసందులోంచి ముక్కులు దూర్చి పైకి చూసే కోడి పిల్లలు, దివ్యమైన, ఏదో తీవ్రమైన, అందమైన అనుభూతికి లోనయ్యాడు సోమసుందరం

కోడి పిల్లల్ని చూసిన అతని మనసు గతంలోకి జారింది తను చిన్నతనంలో, పక్కింటి వారి కోడి పిల్లను పిసికి చంపిననాడు నాయనమ్మ తిట్టింది ‘వెధవా! చెప్పిన మాట వినవు, పాపపు పనులు చేస్తున్నావు అడవులు పట్టిపోతావు’ అని, ఆ తిట్లు ఇప్పుడు తనకి తగిలాయిలా ఉంది. నవ్వుకున్నాడు సోమసుందరం

పదినిమిషాల తర్వాత, బి డి.ఒ కి అతనితో వచ్చిన వారికి, గాజుగ్లాసులతో టీ తెచ్చి ఇచ్చింది ప్రెసిడెంటు భార్య, అంతకు ముందు కాళ్ళు కడుక్కోండి అని తెల్లగా తోమిన ఇత్తడి చెంబులో నీళ్ళిచ్చింది

మర్యాద తెలిసినది-అని ఆమెను మనసులోనే మెచ్చుకున్నాడు సోమసుందరం. టీ కొద్దిగా సిప్ చేశాడు. బాగా మరిగించిన బెల్లపు టీ అది, వెగటుగా ఉంది, వాసన వేస్తూంది

“గొడుగేదన్నా ఉంటే ఇవ్వమ్మా!” అడిగాడామెను ఆమె గొడుగు తేవటానికి మరొక ఇంట్లోకి వెళ్ళింది చప్పున అందరూ “టీ”లు వాకిట్లో




వర్షంలో వంపేసి గ్లాసులు కింద పెట్టారు

గడ్డితో అల్లిన గొడుగు తెచ్చి ఇచ్చిందామె

ఆ గొడుగు ముసుగులా తలమీద కప్పుకుని వాకిట్లోకి అడుగు పెడుతూ 'చీకటిపడుతూందివర్షంతగ్గేలాలేదు' స్వగతంలాఅన్నాడుసోమసుందరం అతని వెనుక వెంటవచ్చిన వారు నడిచారు, సన్నగా తడుస్తూ

ఆ మాటవిన్న ప్రెసిడెంటుభార్య పెద్దమ్మి "ఉండండయ్యావంటసేసుకుందురు" అంది

చిన్నగా నవ్వి గబగబా నడుస్తూ "మీరు ఉండండి వర్షం" అన్నాడు వెనుక వచ్చేవారితో సోమసుందరం


"ఫరవాలేదు సార్! వర్షం తగ్గిపోతూంది అన్నారు వాళ్ళు

ఆ ఊరి పొలాల్లో కొత్తగా తవ్వించిన చెరువులుచూసి ఇళ్ళుకట్టండని ఆ ఊరి ప్రజలకు చెప్పి, మళ్లీ జీపు దగ్గరకు వచ్చాడు సోమసుందరం

అక్కడ ఓచెట్టు క్రింద నిల్చున్న ఓ ముసలమ్మ అతని దగ్గరకు వచ్చి నమస్కరించింది. ఏదో అతని తోనే చెప్పాలని ఆత్రుత ఆమె ముఖంలో కనుపించింది.

ప్రశ్నార్థకంగా ఆమెవైపుచూశాడు సోమసుందరం

ఆమె నెమ్మదిగా, గుసగుసగా చెప్పింది "ఇళ్ళు కడతారు కాని



బియ్యం, గోధుమలు, డబ్బు, మున సీబుకి ఇయ్యకండయ్యా! ఆడు మాకు అన్నీ ఇవ్వడు ఆడు తింటాడు"

నవ్వుతూ అలానె అన్నట్లు తల వూపి జీపెక్కాడు సోమసుందరం

అవ్వాళ అతను క్యాంపుల నుంచి తిరిగివచ్చేసరికి రాత్రి ఎనిమిదిగంట లయింది ఉదయం తిన్న టిఫిను ఎప్పుడో అరిగి పోయింది ఆకలి, నీర్సం, అలసట, ఎక్కడ ఏపనులూ అవలేదు తను కలియాలనుకున్న పెద్దలంతా వేటకుపోయారు, ఇటికిల పండగ ధర్మమా అని ఇంటికి చేరే సరికి పర్సు ఖాళీ అయిపోయింది.

అప్పటివరకూ ఆఫీసు దగ్గర బి డీ వో కోసం వెయిట్ చేస్తున్న ఒక వి డీ వో పిర్యాదుచేశాడు, తన ఏరి యాలో కొందరిచేత పాకలు వేయిం చాననీ అవి ఫారెస్టువారు తీసెయ్యా లంటున్నారనీను మేనేజరుచెప్పాడు ఫోను వచ్చింది రేపు సబ్ కలెక్టరు మీటింగు పెడతాడట అని సబ్ కలెక్టరు వేసే ప్రశ్నలు తనిచ్చే జవా బులు తలచుకొంటే తల తిరిగినట్ల యిందతనికి

ఈబ్లాకునుంచి త్వరగా ట్రాన్సుఫరు చేయించుకోవాలి అనే నిర్ణయానికి త్వరలోనేవచ్చాడు సోమసుందరం